క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



లింగాల: మండలంలోని పద్మన్నపల్లికి చెందిన పేదలకు శుక్రవారం గామా ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రేషన్ కార్డు కలిగి ఉన్న పేదలకు మూడు నెలల పాటు సరకులను అందజేస్తామని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసులు, గ్రామస్తులు చిత్రసేనా రెడ్డి, రాజునాయక్, శంకర్, మహేష్, ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ జోజ్యానాయక్, గుడి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతిపై అపోహలు వద్దు

కల్వకుర్తిరూరల్: గృహజ్యోతి పథకంపై ప్రజలు అపోహలకు గురై ఆందోళన చెందొద్దని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా వైస్ చైర్మన్ నిజాముద్దీన్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే కుటుంబాలకు జీరో బిల్లులు అమలు చేస్తున్నామన్నారు. జీరో బిల్లులు రాని వారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కుక్కల దాడిలో మూడు మేకలు మృతి

లింగాల: మండలంలోని కోమటికుంట శివారులో మేకల మందపై కుక్కలు దాడి చేయడంతో మూడు మేకలు చనిపోగా పలు మేకలు గాయాలకు గురైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు చంద్రకంటి శ్రీను తన పొలంలో మందను నిలిపి రాత్రి అక్కడే ఉంచాడు. ఉదయం పని నిమిత్తం కాపరి ఇంటికి వెళ్లాడు. తిరిగి వచ్చే సమయం లోపు ఊరు కుక్కలు మందపై దాడి చేసి మేకలను చంపివేశాయి. మృతి చెందగా మేకల విలువ రూ.50 వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయారు.

37వ సారి రక్తదానం

కల్వకుర్తిరూరల్: ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని గవర్నర్ కార్యాలయం రాజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పట్టణానికి చెందిన ప్రగతి ఫౌండేషన్ అధ్యక్షుడు ఆరీఫుద్దీన్ 37వసారి రక్తదానం చేశారు. సందర్భంగా ఆయనకు నిర్వాహకులు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

రైతుల ఖాతాలో ధాన్యం డబ్బులు జమ

కోడేరు: మండలంలోని వరి కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యం డబ్బులు పూర్తిగా రైతుల ఖాతాలో జమ చేసినట్లు ఏపీఎం పార్వతమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 958 మంది రైతులకు రూ.10 కోట్ల వరకు డబ్బులు జమ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. మొత్తం 48,934 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు.

యాపట్ల పాఠశాలను సందర్శించిన గ్రామస్తులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని యాపట్ల ప్రాథమిక పాఠశాలను గ్రామస్తులు అజయ్, జహంగీర్, పరమేష్‌గౌడ్‌లు శుక్రవారం సందర్శించారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాం దుస్తులు వచ్చాయా లేవా అని ప్రధానోపాధ్యాయుడు షాకీర్‌పాషాను అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా నిర్మించిన అదనపు గదిని పరిశీలించారు.

ప్రజలు సహకరించాలి

కోడేరు: మండలంలో చేపడుతున్న మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు, పస్పుల తదితర గ్రామాల్లో జరుగుతున్న సర్వే వివరాలను పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో మొత్తం 11 వేల 79 మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఉన్నాయని ఇప్పటి వరకు 3073 ఇళ్లలో సర్వే పూర్తి చేశామన్నారు. రవితేజ పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

నాగర్‌కర్నూల్: ఇందిరాపార్కు వద్ద ఈ నెల 15న తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని బీసీ జనసభ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో వివిధ బీసీ కుల, సంఘాలతో సమావేశం నిర్వహించారు. మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ అనంతరం విలేకరులతో మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలో సమగ్ర కులగణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకోకుండా కులగణనకు చట్టబద్ధత కల్పించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట.. రేవంత్ రెడ్డి ద్వంద వైఖరికి నిదర్శనమని అన్నారు. కాళ్ల నిరంజన్, మల్లేష్‌గౌడ్, కురుమూర్తి, అశోక్ యాదవ్, కొ్ట్ర శీను, నిరంజన్ యాదవ్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

● సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన వాటిని కొనుగోలు చేసేందుకు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా అధికార పార్టీ కాంగ్రెస్ సభ్యులు పలు సమస్యలను లేవనెత్తారు. ముఖ్యంగా 2021లో వచ్చిన జీఓను అనుసరించి మున్సిపాలిటీలో పనిచేసే 28 కార్మికులకు జీతాలు పెంచాలని ఉత్తర్వులు ఉన్నా వాటిని ఇంకా అమలు చేయటం లేదని సభ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో ఈ పాలక వర్గం వచ్చిననాటి నుంచి చేపట్టిన వివరాలను అడిగితే కమిషనర్, ఏఈలు ఒకరిపై ఒకరు చెబుతూ వాటి వివరాలను ఆరు నెలలుగా ఇవ్వటం లేదని వాపోయారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలన్నారు. పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుదా మన్నారు. వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు, కమిషనర్ ఆశ్రిత్ కుమార్, మేనేజర్ రాజ కుమారి, ఏఈ విజయ్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ అధికారి విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం నిల్వల పరిశీలన



జీడిపల్లిలో ధాన్యాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ఇబ్రహీం

కల్వకుర్తిరూరల్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైస్ మిల్లు యజమానులు బియ్యం ప్రభుత్వానికి అందజేయాలని తహసీల్దార్ ఇబ్రహీం కోరారు. శుక్రవారం పట్టణంతోపాటు మండలంలోని జీడిపల్లిలో ఉన్న రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా మిల్లులలో ధాన్యం నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వం ఎంత ధాన్యం ఇచ్చింది ఎంత బియ్యం ప్రభుత్వానికి అప్పగించారని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న బియ్యాన్ని వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని సూచించారు. గడువు ముగిసేలోగా టార్గెట్‌లు పూర్తి చేయని మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

కొల్లాపూర్: మండలం రామాపురం గ్రామ సమీపంలో వాగు నుంచి కొందరు వ్యక్తులు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు బిజ్జ వేణు శుక్రవారం తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో వాగుల నుంచి ఇసుక తరలించినప్పుడు ఆందోళనలు, ధర్నాలు చేసిన నాయకులే ఇప్పుడు వాగు పొడవునా ఇసుక డంపులు ఏర్పాటుచేసి రూ.లక్షలకు విక్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు. స్థానిక ప్రజాప్రతినిధులు అండతోనే ఇవన్నీ జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక డంపులు సీజ్ చేయాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రేషన్‌కార్డులు ఇవ్వాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్రంలో రేషన్ కార్డులు లేని అర్హులైన వారిని గుర్తించి రేషన్‌కార్డులు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అందులో భాగంగా రేషన్‌కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏకాంబరం, బాలపీరు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే అనుచిత వ్యాఖ్యలు



మన్ననూర్: పార్టీ ఉనికి కోసమే బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండల కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఆరోపించారు. శుక్రవారం మన్ననూర్‌లోని ఓం చౌరస్తాలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత 26 ఏళ్లుగా వైద్య వృత్తితో పాటూ ప్రజా క్షేత్రంలో సేవలందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణపై మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ అసత్య ప్రచారాలు చేయడం తగదన్నారు. నోరు అదుపులో పెట్టుకోకుంటే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, మేరాజ్, బాలస్వామి, యశ్వంత్, పాండు, లోకనాథం పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం

నాగర్‌కర్నూల్: భాషా పండితులు, పీఈటీల పదోన్నతులకు అనుకూలంగా సుప్రీకోర్టు తీర్పు వెల్లడించడం చారిత్రాత్మకమని నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రీయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షులు విజయకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భాషా పండితుల రెండు దశాబ్దాల కల నెరవేరిందని పేర్కొన్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్ర ఉపాధ్యాయ పండిత పరిషత్ కార్యదర్శి శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసం



ఉప్పునుంతలలో అక్షరాభ్యాసంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు



తుర్కలపల్లి ప్రాథమిక పాఠశాలలో

ఉప్పునుంతల: స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలలో ఈ ఏడాది కొత్తగా చేరిన విద్యార్థులతో అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ ఆలూరి అరుణ, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు బాలమణి, వెంకటేష్ విద్యార్థులకు పలకలపై అక్షరాలను దిద్దించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని తుర్కలపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందిన చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని జీహెచ్‌ఎం భగవాన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలు ప్రభుత్వ బడిలో చేరేవిధంగా కృషి చేయాలని కోరారు. అదే విధంగా తుర్కలపల్లి ప్రాథమిక పాఠశాలలో 7వ తరగతి పూర్తి చేసుకున్న 16 మంది విద్యార్థులను హెచ్‌ఎం మహిపాల్ నాయక్ ఆధ్వర్యంలో చారకొండ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతిలో చేర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: యాపట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు హెచ్‌ఎం శాకీర్‌పాషా తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, మంజుల, ప్రవీన్, నరేష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ, తదితరులు

చారకొండ: మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అని ఎస్‌ఐ ఎన్ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ సర్కిల్‌లో పోలీస్, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామస్తులు, యువకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు వివేక్, సిరాజ్, అరుణ పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తెలకపల్లి: గత సంవత్సరం డిసెంబర్ 10న నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఫలితాల్లో గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, మల్లికార్జున్ మాట్లాడుతూ విద్యార్థులు వరలక్ష్మి, యశ్వంత్‌గౌడ్, మధుచరణ్, జాన్సీరాణి నేషనల్ మీల్స్‌కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే 8వ తరగతి విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాన్ని అందించేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తారని ఎంపికన వారికి ఇంటర్మీడియేట్ వరకు ప్రతి సంవత్సరం ఒక్కొక్కరికి రూ.12వేలు అందిస్తుందన్నారు. ఉపాధ్యాయులు వెంకటేష్, నర్సింహులు, మధుసూదన్‌రెడ్డి, కృష్ణయ్య, లక్ష్మీనర్సింహరెడ్డి, ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులు మల్లికార్జున్, రవివర్మ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం తోటలతో అధిక లాభాలు



పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి లక్ష్మన్

నాగర్‌కర్నూల్‌రూరల్: ఆయిల్‌పాం తోటలతో అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారి లక్ష్మన్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని గన్యాగులలో రైతులు సాగు చేసిన ఆయిల్‌పాం తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయిల్‌పాం సాగు చేసిన రైతులకు ప్రభుత్వం అధికం సబ్సిడీ ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు ఉన్నారు.

చేగువేరాకు ఘన నివాళి

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక పట్టణంలోని సీపీఐ పార్టీకార్యాలయంలో శుక్రవారం ఏఐఎస్‌ఎఫ్ నాయకులు చేగువేరా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుగౌడ్, ప్రేమ్‌కుమార్‌లు చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యూబా స్వాతంత్ర్య ఉద్యమంలో చేగువేరా కీలక పాత్ర పోషించారన్నారు. అసమానతలు లేని సమాజం కోసం పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నరేష్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి : మండలంలోని గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం చేగువేరా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం బాలకృష్ణారెడ్డి, ఉపాధ్యాయుడు రాజారాం ప్రకాష్ ఆధ్వర్యంలో చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, శేఖర్, రాజప్ప, మహమ్మద్, కురుమయ్య, రమాదేవి, హిందుమతి, ఉర్మిళ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంలకు సన్మానం

సాక్షి, నెట్‌వర్క్: చారకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జీహెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన భగవాన్ రెడ్డిని శుక్రవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా తాడూరు మండలం మేడిపూర్ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం త్యాగరాజుగౌడ్, లింగాల మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం జ్యోతిరాణి, వెల్దండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం ఆర్. రవీందర్‌లు బాధ్యతలు చేపట్టారు. అమ్రాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం పాఠశాలలో జీహెచ్‌ఎంలుగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మణ్‌రావు, హన్మంత్‌రెడ్డిలను మండల విద్యాధికారి బాల్‌కిషన్, ఉపాధ్యాయ బృందం శాలువాలతో సన్మానించి స్వాగతం పలికారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన బైక్ మెకానిక్ పాండు అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం కల్వకుర్తి సగర సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. రూ.5 వేల నగదు, 50 కేజీల బియ్యంను అందజేశారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కోడేరు: విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బద్దుల నరసింహకు సంబంధించిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఎర్తు వైర్‌కు తగిలి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.80 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



బహుమతులను అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, నాయకులు

కల్వకుర్తి టౌన్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో కల్వకుర్తి ప్రీమియర్ లీగ్‌-3 ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి టోర్నీలు ఉపయోగపడతాయని, గెలుపోటములు ప్రతిఒక్కరూ సమానంగా స్వీకరించాలన్నారు. దాదాపు 20 రోజులుగా నిర్వహించిన కేపీఎల్‌-3 సీజన్‌లో ఫైనల్‌లో బాలాజీ బుల్స్, చీమర్ల ఛాలెంజర్స్ జట్లు తలపడగా బాలాజీ బుల్స్ టీం విజయం సాధించింది. స్థానిక ఎమ్మెల్యే విజేత జట్టుకు రూ.లక్ష, కాంగ్రెస్ నాయకుడు ఆశాదీప్‌రెడ్డి రన్నరప్ జట్టుకు రూ.50వేలు, తృతీయ విజేతకు ఐక్యత చైర్మన్ రాఘవేందర్ రెడ్డి సమకూర్చిన బహుమతులను బాలాజీ సింగ్ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బాలునాయక్, టోర్నీ నిర్వాహకులు నాగేష్, జమీర్, హరికిషన్ శర్మ, ఆయా జట్ల క్రీడాకారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



పెంట్లవెల్లిలో విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న హెచ్‌ఎం



చారకొండలో

చారకొండ: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం యూనిఫాం దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. జీహెచ్‌ఎం భగవాన్ రెడ్డి, అమ్మఆదర్శ పాఠశాల చైర్మన్ సత్యమ్మ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

లింగాల: మండలంలోని 19 పాఠశాలలకు సంబంధించిన 980 మంది విద్యార్థులకు యూనిఫాం దుస్తులను మహిళా సంఘాల సభ్యులతో కుట్టించినట్లు మండల విద్యాధికారి చంద్రుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో పలు పాఠశాలలకు ఏకరూప దుస్తులను పంపిణీని ఎంఈఓ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ కర్ణనాయక్, ఏపీఎం బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలం మల్లేశ్వరంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజేందర్‌సింగ్ పంపిణీ చేశారు. అదేవిధంగా బడిబాట నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన వసతులు కల్పిస్తునట్లు వివరించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న సంస్థ కౌన్సిలర్ మన్సూర్

పెద్దకొత్తపల్లి: మండలంలోని గంట్రావ్‌పల్లిలో ఉపాధి కూలీలకు సొసైటీ ఫర్ ట్రాన్స్‌ఫార్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కౌన్సిలర్ మన్సూర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానమంత్రి సురక్షబీమాయోజన, జీవనజ్యోతియోజన, ఇన్సూరెన్స్, బాలికల కోసం సుకన్య సమృద్ధి యోజన పథకం చేయించుకోవాలని అన్నారు. వ్యక్తిగత వివరాలను ఎవరికి చెప్పొద్దన్నారు. కార్యక్రమంలో రూపేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యంగౌడ్ ఉన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

నాగర్‌కర్నూల్: జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్య అందించాలని కోరుతూ శుక్రవారం టీయూడబ్ల్యూజే హెచ్ 143 జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర రావు, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు కానాపురం ప్రదీప్, ఐజేయు జాతీయ నాయకుడు జెమినీ సురేష్‌ల ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫొటో, వీడియో, డెస్క్ జర్నలిస్టుల పిల్లలకు గతంలో మాదిరి ఈ ఏడాది కూడా ఉతత విద్య కోసం సర్క్యులర్ జారీ చేయాలని విన్నవించారు. డీఈఓ సానుకూలంగా స్పందిస్తూ సర్క్యులర్‌ను రెండు రోజుల్లో జారీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సీనియర్ జర్నలిస్టులు ఉమాశంకర్, అహ్మదుల్లా ఖాన్, బాబు సాగర్, ఫొటో జర్నలిస్టు సంఘం జిల్లా నాయకులు కపిలవాయి రాజు, జర్నలిస్టులు సత్యం, బాలస్వామి, రామకృష్ణ, మహమ్మద్ సాధిక్, ఏటిగడ్డ వెంకటేష్, ఆనంద్, శేఖర్, ప్రకాష్ ఫొటో జర్నలిస్ట్ వీరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



లింగాల: మండలంలోని అంబట్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి సరఫరా అయిన పాఠ్యపుస్తకాలను సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణగౌడు, మాజీ సర్పంచు రవిశంకర్, హెచ్‌ఎం జ్యోతిరాణి పంపిణీ చేశారు.

తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పలకలను పంపిణీ చేశారు. అదేవిధంగా కొత్తగా పాఠశాలలో మొదటి తరగతిలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం అర్జున్, క్లాస్‌మెట్ క్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు డ్రోన్ పైలెట్‌పై ఉచిత శిక్షణ

కొల్లాపూర్: నియోజకవర్గ పరిధిలోని మహిళలకు రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా డ్రోన్ పైలెట్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ వెల్లడించారు. తార యూఏవీ ప్రైవేటు లిమిటెడ్ వారి సహకారంతో 20 రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందని వెల్లడించారు. డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, మెడికల్ ఫిట్‌నెస్ ఉన్న మహిళలకు ప్రాధాన్యం ఇస్తారన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను దృష్టిలో ఉంచుకొని డ్రోన్ వినియోగంపై మహిళకు శిక్షణ ఇవ్వాలని ఫౌండేషన్ నిర్ణయించినట్లు తెలియజేశారు. ఈ నెల 15, 16 తేదీల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో శిక్షణకు మహిళల ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన వారికి హైదరాబాద్‌లో శిక్షణ ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9177050558కు ఫోన్ చేయాలని సూచించారు.